క్లుప్తంగా

సాదాసీదాగా ఆర్మూర్ మండల సమావేశం



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. అలాగే వివిధ శాఖల పనితీరుపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి



పెర్కిట్(ఆర్మూర్): రానున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ నాయకుడు పైడి రాకేష్‌రెడ్డి కోరారు. ఆర్మూర్ మండలం అమ్దాపూర్, మగ్గిడి, ఖానాపూర్ గ్రామాల్లో బుధవారం బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా పైడి రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే ఉచిత విద్య, వైద్యం వంటి సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. నాయకులు విజయభారతి, రోహిత్ రెడ్డి, అందాపూర్ రాజేష్, పాలెపు రాజు, గంగాధర్, వినోద్, నరేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణులు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి



కోటగిరి(రుద్రూర్): బీఆర్‌ఎస్ శ్రేణులు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రణాళికాబద్ధంగా పని చేయాలని బాన్సువాడ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి సూచించారు. కోటగిలో బుధవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి బీఆర్‌ఎస్ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి విజయానికి కృషి చేయాలని వివరించారు. నాయకులు శంకర్ పటేల్, శ్రీనివాస్‌రావ్ ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల్లా శ్రమించాలి



రెంజల్(బోధన్): కాంగ్రెస్ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కార్తీక్ పేర్కొన్నారు. మండలంలోని సాటాపూర్‌లో బుధవారం యువజన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి విజయం కోసం తీవ్రంగా శ్రమించాలని సూచించారు. అనంతరం మండల యువజన కాంగ్రెస్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాయకులు రాజు, సద్దాం, శంషోద్దీన్, స్నేహిత్, గిరిగౌడ్, సాయికిరణ్, నవీన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలి



వేల్పూర్: మండలంలోని పచ్చలనడ్కుడలో కొత్తగా విడుదల చేసిన ఓటరు లిస్టులో చనిపోయినవారి పేర్లు ముద్రణ అయ్యాయని వాటిని తొలగించాలని మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి దురాజి రవి డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఆయన వేల్పూర్ తహసీల్దార్ నాగార్జునకు వినతిపత్రం అందజేశారు. అలాగే విదేశాలలో ఉన్నవారు, ఒక్కో ఓటరు పేరు రెండు మూడుచోట్ల ముద్రణ అయ్యిందని తహసీల్దార్‌కు విన్నవించారు. తప్పుగా ఉన్న ఓటరు లిస్టును వెంటనే సరిచేయాలని, లేనిచో ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

నియామకం

బోధన్: సాలూర గ్రామానికి చెందిన రాహుల్ లక్ష్మణ్ కాంగ్రెస్ సాలూర మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం పట్టణంలో టీపీసీసీ కోశాధికారి, మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. నాయకులు శరత్ రెడ్డి, మందర్నా రవి, అల్లె రమేష్ పాల్గొన్నారు.

నవ దుర్గా నమోస్తుతే..



పోతంగల్‌లోని దుర్గామాత మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ పోచారం దంపతులు



ఆర్మూర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే



రుద్రూర్‌లో కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు



వద్యాట్‌లో దుర్గాదేవి విగ్రహం వద్ద చండీ హోమం నిర్వహిస్తున్న భక్తులు

పెర్కిట్/రుద్రూర్/బాల్కొండ/మోర్తాడ్/పోతంగల్(రుద్రూర్): ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో దుర్గామాత శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహాలక్ష్మి, అన్నపూర్ణ దేవి అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా గ్రామాల్లో ప్రతిష్ఠించిన జగన్మాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. ఆర్మూర్‌లోని రంగాచారి నగర్‌లో ఏర్పాటు చేసి దుర్గామాత మండపం వద్ద ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పోతంగల్‌లోని దుర్గామాత మండపం వద్ద నిర్వహించిన నవచండీ యాగం కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి దంపతులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. పోచారం సురేందర్‌రెడ్డి, సర్పంచ్ వర్ని శంకర్, వైస్ ఎంపీపీ గంగాధర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. బోధన్‌లోని శ్రీ చక్రేశ్వర ఆలయం, శ్రీ సార్వజనిక్ దుర్గామాత మండపంలో ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వద్యాట్ గ్రామంలో..



బోధన్‌లో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కవిత



కిసానగర్‌లో..

కాంగ్రెస్ విజయం కోసం కృషి చేయాలి

పెర్కిట్(ఆర్మూర్): రానున్న శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ అభ్యర్థి పొద్దుటూరి వినయ్ రెడ్డి విజయం కోసం కృషిచేయాలని డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పెర్కిట్‌లో బుధవారం రాహుల్ గాంధీ పర్యటనను పురస్కరించుకుని కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మానాల మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే ప్రకటించిన ఆరు పథకాలను అమలు చేయనున్నట్లు వెల్లడించారు. దీంతోపాటు ఈ నెల 20న ఆర్మూర్‌లో నిర్వహించే రాహుల్ గాంధీ కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి

నాయకులు మార చంద్రమోహన్, యాల్ల సాయారెడ్డి, గంగాధర్‌గౌడ్, సాయిబాబాగౌడ్, కోల వెంకటేష్, భూమేష్, జిమ్మి రవి, మీసాల రవి, ప్రకాశ్, చిన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు ఆన్‌లైన్‌లో చెల్లించాలి





రుద్రూర్‌లో వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న విద్యుత్ సిబ్బంది.. చందూర్‌లో..

రుద్రూర్/వర్ని/బాల్కొండ: విద్యుత్ బిల్లులను వినియోగదారులు ఆన్‌లైన్‌లో చెల్లించాలని విద్యుత్‌శాఖ సిబ్బంది సూచించారు. ఈమేరకు బుధవారం రుద్రూర్, చందూ, బాల్కొండ మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈసందర్భంగా ట్రాన్స్ కో సిబ్బంది మాట్లాడుతూ.. ఎప్పుడైనా, ఎక్కడైనా వెబ్‌సైట్, మొబైల్ ద్వారా బిల్లులు చెల్లించవచ్చని సూచించారు. బిల్లులను డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు, ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం వంటి యాప్‌లలో ఆన్‌లైన్ ద్వారా చెల్లించే విధానం గూర్చి వివరించారు. విద్యుత్ శాఖ సీనియర్ అకౌంటెంట్ రాజశేఖర్, సిబ్బంది శంకర్ నాయక్, చంద్రశేఖర్, లైన్‌మెన్లు, వీడీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



చిట్టాపూర్ గ్రామంలో..

రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఆశీర్వదించండి

రెంజల్(బోధన్): రాబోయే ఎన్నికల్లో బోధన్ నియోజకవర్గం నుంచి బీజేపీని ఆశీర్వదించి, గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని కూనేపల్లి, రెంజల్, బాగేపల్లి, దూపల్లి గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి, చాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వీధి వ్యాపారులతో మాట్లాడుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల రైతులతో చర్చించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లు రాష్ట్రాన్ని అప్పులపాలు చేశాయని వివరించారు. ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని అన్నారు. నాయకులు గోపీక్రిష్ణ, సంతోష్, రాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, పోశెట్టి, పోచయ్య పాల్గొన్నారు.



కూనేపల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న మేడపాటి

రాహుల్‌గాంధీని విమర్శించే స్థాయి కవితకు లేదు

బోధన్‌టౌన్(బోధన్): తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని, కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీని విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ కవితకు లేదని, అర్హతను బట్టి మాట్లాడాలని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని రవి గార్డెన్‌లో బుధవారం సాలూర, బోధన్ మండల బూత్ కమిటీల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎమ్మెల్సీ కవితతో పాటు ఎమ్మెల్యే షకీల్ చిట్టాలు విప్పితే మీరు మాట్లాడలేరన్నారు. పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి కాంగ్రెస్ పార్టీని గెలిపిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం బీఆర్‌ఎస్ నేత ఆబీద్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి సుదర్శన్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నాయకులు నాగేశ్వర్‌రావ్, రవి, అశోక్, రాజు, గంగాశంకర్, తూము శరత్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్ ఉన్నారు.



బోధన్‌లో మాట్లాడుతున్న సుదర్శన్ రెడ్డి

సొంత లాభానికే ప్రాజెక్టుల నిర్మాణం

నవీపేట: సొంత లాభాలను ఆశించే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించిందని మాజీ మంత్రి, బోధన్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో బుధవారం జరిగిన పార్టీ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పార్టీ మేనిఫెస్టోపై విస్తృత ప్రచారం కల్పించాలని కార్యకర్తలకు సూచించారు. అనంతరం పార్టీ కిసాన్‌సెల్ విభాగం మండల అధ్యక్షుడిగా సురకత్తుల పెద్దన్న, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా రాజేశ్వర్‌కు నియామక పత్రాలను అందజేశారు. నాయకులు తాహెర్‌బిన్ హందాన్, సుధాకర్‌రావ్, శ్రీనివాస్‌గౌడ్, రాజేంద్రకుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి

బోధన్: బూత్ లెవల్ కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని మహారాష్ట్ర ప్రాంతం పూణేలోని శివాజీనగర్ బీజేపీ ఎమ్మెల్యే సిద్దార్థ్ శిరోలే సూచించారు. పట్టణంలోని ఎంపీఆర్ ఆఫీసులో బుధవారం ఎమ్మెల్యే ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య, నాయకులు మేడపాటి ప్రకాష్‌రెడ్డి, వడ్డీ మోహన్‌రెడ్డి, అడ్లూరి శ్రీనివాస్, నర్సింహారెడ్డి, శ్రీధర్, కరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతు బీజేపీ ఎమ్మెల్యే సిద్ధార్థ్ శిరోలే

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలోని సర్పంచ్ తండా, రూప్లా తండాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి వేల్పూర్‌లోని మంత్రి ప్రశాంత్‌రెడ్డి నివాసంలో రాష్ట్ర క్రిస్టియన్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ రాజేశ్వర్ రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు తిరుపతి, భూమయ్య, అంబర్ సింగ్, రాజారామ్, భూమ్యానాయక్ పాల్గొన్నారు.



రెంజల్(బోధన్): మండలంలోని కిసాన్‌తండా సర్పంచ్ జాదవ్ జమున ఆధ్వర్యంలో పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. సర్పంచ్ వారికి పార్టీ కండువాలు కప్పి, బీఆరఎస్‌లోకి ఆహ్వానించారు. నాయకులు విజయ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

మాక్లూర్: తన పదవి కాలంలో అన్ని వర్గాల ప్రజలను సమానంగా చూస్తూ, వారి అభివృద్ధికి కృషి చేశానని ఆర్మూర్ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొత్తపల్లి, చిక్లి, దీకంపల్లి, అడవి మామిడిపల్లి గ్రామాలలో బుధవారం ఆయన ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొని మాట్లాడారు. మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ముందుంచుతానాని ప్రజలకు హామీ ఇచ్చారు. అంతకుముందు ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. సర్పంచులు సుబ్బారావు, దీమేర శ్రీకాంత్, గుండు రవి, చింత మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

ఆర్మూర్: బీజేపీ నాయకులు రాకేష్‌రెడ్డి చౌకబారు రాజకీయాలు మానుకోవాలని ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. పెర్కిట్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పదిరోజులకు ఒకసారి ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో గోప్యంగా మాట్లాడే రాకేష్‌రెడ్డి, తాను ఎమ్మెల్యే ఒక్కటేనని ఆపాదించడం నీతిమాలిన రాజకీయాలకు నిదర్శనమన్నారు. ఆర్మూర్ నియోజకవర్గం నుంచి రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి పేదలకు ఇప్పటి వరకు ఒక్క డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇవ్వలేదని విమర్శించారు. ఆర్మూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తానని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు కోలా వెంకటేష్, సాయిబాబాగౌడ్, ఫయిమ్, అజ్జు, జిమ్మి రవి, మీసాల రవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

నందిపేట్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు గోర్త రాజేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఇప్పటివరకు ఏర్పాటు చేయకపోవడంతో కోతలు కోసిన రైతులు దళారుల చేతిలో మోసపోతున్నారని, ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు గంగాధర్, ప్రవీణ్, ప్రశాంత్, శ్రీనివాస్, ఫరీద్, నిఖిల్, నవనీత్, మహేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.



నందిపేటలో మాట్లాడుతున్న గోర్త రాజేందర్

బీజేపీలోకి పలువురు..



భీమ్‌గల్: మండలంలోని చేంగల్ గ్రామానికి చెందిన గౌడ కులసంఘ సభ్యులు బుధవారం మాజీ ఎంపీపీ న్యాక మోహన్‌గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కన్నగారి మోహన్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు ములిగే మహిపాల్, మధు పాల్గొన్నారు.

బతుకమ్మ.. బతుకమ్మ.. ఉయ్యాలో..



బొప్పాపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



బోధన్‌లోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో..



కమ్మర్‌పల్లిలో బతుకమ్మను నిమజ్జనానికి తీసుకెళ్తున్న విద్యార్థులు

రుద్రూర్/బోధన్‌టౌన్/కమ్మర్‌పల్లి: ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజకవర్గాల్లో బతుకమ్మ పండుగ సంబురాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బోధన్‌లోని ఉషోదయ డిగ్రీ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర సాహిత్య పురస్కార గ్రహిత, కవయిత్రి పొద్దుటూరి మాధవిలత హాజరై విద్యార్థినులతో బతుకమ్మ ఆడారు. కమ్మర్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు బతుకమ్మను పేర్చి, పాటలు పాడుతూ, బతుకమ్మ ఆట ఆడారు. అనంతరం బతుకమ్మను ఊరేగింపుగా గ్రామ శివారులోని బొడ్డెమ్మ చెరువుకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

సినిమాలు | తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	లియో(తెలుగు) - 11.30, 2.55, 6.20, 9.45
స్క్రీన్-2 –	లియో(తెలుగు) - 9.10, 12.35, 4.00, 7.25, 10.50
స్క్రీన్-3 –	భగవంత్ కేసరి (తెలుగు) - 09.00, 12.35, 3.50, 7.15, 10.40
స్క్రీన్-4 –	భగవంత్ కేసరి (తెలుగు)-11.15, 2.40, 6.05, 9.30

సంక్షిప్తం

కరపత్రాల ఆవిష్కరణ

బోధన్: పట్టణంలో బుధవారం మాదిగ యుద్ధభేరి కార్యక్రమ కరపత్రాలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. నవంబర్ 5న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మాదిగ యుద్ధభేరి సభకు మాదిగ, ఉపకులాల బంధువులు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

బోధన్‌లో వైద్యశిబిరం

బోధన్: పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన నేత్రాలయ ఆస్పత్రి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య, రాజేశ్వర్ ఉన్నారు.

స్పీకర్‌కు మద్దతుగా తీర్మానం

వర్ని: రాబోయే ఎన్నికల్లో బాన్సువాడ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి మద్దతు తెలుపుతూ బుధవారం చందూరులోని నాయీ బ్రాహ్మణ, కమ్మ సంఘం నాయకులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈమేరకు తీర్మానప్రతిని వారు స్పీకర్‌కు అందజేశారు. సర్పంచ్ సాయిరెడ్డి, అశోక్, రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

సునీల్‌రెడ్డికి మాజీ మంత్రి పరామర్శ

బాల్కొండ: మెండోరా మండలం సావెల్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డిని బుధవారం మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి, రైతు కూలీ సంఘం నాయకులు పరామర్శించారు. నాయకులు తాహెర్‌బిన్ హందాన్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ కార్యాలయం ప్రారంభం

బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్ గ్రామంలో కాంగ్రెస్ కార్యాలయాన్ని బుధవారం పార్టీ నాయకులు ప్రారంభించారు.నాయకులు మహెందర్, రాజేశ్వర్ ఉన్నారు.

వృద్ధులకు వైద్య శిబిరం

మోర్తాడ్: మండలంలోని సుంకెట్‌లో బుధవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో వృద్ధుల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. జిల్లా చైర్మన్ బుస్సా ఆంజనేయులు, సర్పంచ్ కడారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ఫ్రెషర్స్ డే

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో బుధవారం శ్రీభాషిత జూనియర్ కళాశాల ఫ్రెషర్స్‌డే నిర్వహించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ప్రథమ సంవత్సరం విద్యార్థులకు వెల్‌కమ్ పార్టీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన యువకులకు సన్మానం

వేల్పూర్: మండల కేంద్రంలో కానిస్టేబుల్‌గా ఎంపికైన ఇద్దరు యువకులను స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం సన్మానించారు. నాయకులు రేగుల్లరాములు, సర్పంచ్ తీగెల రాధామోహన్, ఎంపీటీసీ మొండి మహేశ్, బబ్బూరు ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వర్ని: మండలంలోని పాత వర్ని గ్రామానికి చెందిన మాజీ మండల కోఆప్షన్ సభ్యులు ఎజాజ్ ఖాన్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని బుధవారం ఎమ్మెల్సీ కవిత పరామర్శించారు. నాయకులు సురేందర్ రెడ్డి, వీర్రాజు, నాగభూషణం పాల్గొన్నారు.